నమస్తే తెలంగాణ
సూర్యాపేట
I నల్లగొండ, శనివారం 12 ఏప్రిల్ 2025 SURYAPET


బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు

## బీఆర్‌ఎస్ రజతోత్సవానికి అధిక సంఖ్యలో తరలిరావాలి

- కేసీఆర్ సారథ్యంలోనే రాష్ట్రం ప్రగతి పథం
- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 11 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం చలో వరంగల్ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్నదని, పార్టీ రాష్ట్రానికి, ప్రజలకు ఎంతో చేసిందని అన్నారు. సాధించుకున్న స్వరాష్ట్రాన్ని కేసీఆర్ సారథ్యంలో అన్ని రంగాలను అగ్రగామిగా నిలిపారని తెలిపారు. పేదరికాన్ని పారదోలామని, గ్రామాలు, పట్టణాలను అన్ని విధాలుగా తీర్చి దిద్దుకున్నామని చెప్పారు. సాగునీరు, ఉచిత విద్యుత్, రైతు బంధు తదితర పథకాలతో కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చారని తెలిపారు. రైతులు, ప్రజలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉంటుందని అన్నారు. రజతోత్సవ పండుగలో గులాబీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, నాయకులు అతికం లక్ష్మీనారాయణ, ఇట్టబోయిన గోపాల్, అబ్బగాని వెంకట్, కడారి వినోద్, కస్తూరి పాండు, తుమ్మల పాండు, వెల్దుర్తి రఘునందన్, ర్యాకల శ్రీనివాస్, కంచి మల్లయ్య, శివకుమార్, పెంట నితిన్, నాగారం సూరజ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పక్కన బీఆర్‌ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి

## వరంగల్ సభకు ప్రతి గ్రామం నుంచి రావాలి

- పార్టీ శ్రేణులు, అభిమానులు సిద్ధం కావాలి
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 11 : బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, నియోజకవర్గం నుంచి ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మునుగోడు మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ మునుగోడు మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రాన్ని సాధించడమే కాకుండా తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలబెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. రానున్న రోజుల్లో అధికారం మళ్లీ బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి గ్రామం నుంచి సభకు వచ్చేలా సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నేరేడుచర్లలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఒంటెద్దు నర్సింహారెడ్డి

## రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష

- 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో అన్ని వర్గాలు భాగస్వామ్యం కావాలి
- బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి

నేరేడుచర్ల, ఏప్రిల్ 11 : ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. నేరేడుచర్లలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవతం చేయాలని కోరారు. సభ విజయవంతానికి ఈ నెల 14న హుజూర్‌నగర్‌లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీర్‌ఎస్ నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. అంతకు ముందు జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మాజీ ఎంపీపీలు చెన్నబోయిన సైదులు, లకుమళ్ల జ్యోతిభిక్షం, మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ గుర్రం మార్కండేయ్య, నాయకులు కొణతం లచ్చిరెడ్డి, రాపోలు నవీన్‌కుమార్, కుంకు చిన్నయ్య, ఇనపాల పిచ్చిరెడ్డి, పంగ శ్రీను, జిలకర రామస్వామి, సుందరయ్య, ఇంజం అనంత్‌రెడ్డి, శ్రీను, శ్రీనునాయక్, రాజేశ్, రవీందర్, హుస్సేన్, సైదిరెడ్డి, శేఖర్, సుదర్శన్, భరత్ పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



హాలియా, ఏప్రిల్ 11 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యేలు నల్లబోతు భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన పలు అంశాలను చర్చించినట్లు వారు తెలిపారు.

# వడ్లు కొనే దిక్కేది?

- కాంటా వేసేది లేదు.. వడ్లు కొనేది లేదు
- సన్నాల కొనుగోళ్లూ సున్నానే..
- మిల్లర్లు, దళారుల చేతిలో నష్టపోతున్న రైతులు
- కనీస మద్దతు ధర కూడా దక్కని వైనం
- వాన ముప్పుతో మరింత ఆందోళన

## ఉమ్మడి జిల్లాలో ముందర పడని ధాన్యం కొనుగోళ్లు

## కేంద్రాల ప్రారంభాలతోనే సరి.. కొనుగోళ్లు కరువు

**అన్నదాతపై ప్రభుత్వం కక్ష గట్టినట్లు వ్యవహరిస్తున్నది. పంటలకు సాగు నీరు ఇవ్వకుండా లక్షల ఎకరాలను ఎండబెట్టిన ప్రభుత్వం ఇప్పుడు రైతుల చేతికి వచ్చిన కొద్దిపాటి పంటలను కూడా కొనకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేరుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచినా, కొనుగోళ్లు మాత్రం మరిచింది. సూర్యాపేట జిల్లాలో 80 శాతం వరి కోతలు పూర్తయినా, ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క గింజ కూడా కొనలేదు. మరోవైపు సాగర్ ఆయకట్టులో సన్నాల కొనుగోళ్లు సైతం జీరోగానే ఉన్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బోనస్ మాట అటుంచితే రైతులకు కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదు. ఇక్కడ మిలర్లు, దళారులు చెప్పిందే ధరగా మారింది. తరుగులు అదనం. నిన్నమొన్నటి వానలు సైతం రైతులకు నష్టం చేశాయి. వర్షాలు ఇంకా ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలోనూ ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.**

–యాదాద్రి భువనగిరి/సూర్యాపేట, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ)/ నేరేడుచర్ల/మిర్యాలగూడ

యాదాద్రి భువనగిరి జిల్లాలో యాసంగి సీజన్‌లో 2.80లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారుగా 6.5లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పౌర సరఫరాల అధికారులు మాత్రం నాలుగున్నర లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందు కోసం జిల్లాలో 372కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రతిపాదించారు. కానీ, ఇప్పటి వరకు 100 కేంద్రాలను కూడా ప్రారంభించ లేదు. కొన్నిచోట్ల తూ.తూ.మంత్రంగా ప్రారంభించినా కాంటాలు వేయడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 600 మెట్రిక్ టన్నుల ధ్యాం మాత్రమే కొన్నారు. దాంతో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ పోసిన ధాన్యం అక్కడే కుప్పలుగా కనిపిస్తున్నది. దాంతో రైతులు కేంద్రాల్లోనే గడిగాపులు గాయాల్సి వస్తున్నది. మిల్లులు అలాట్‌మెంట్ కాలేదని, ట్యాబ్‌లు ఓపెన్ అవడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. దాంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ రకం క్వింటాకు రూ.2320 ఉండగా.. 1,800 నుంచి 2వేలలోపు మాత్రమే చెల్లిస్తునారు. ఇదిచాలదన్నట్లు క్వింటాకు 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారు.

### వాన ముప్పుతో ఆందోళన..

గురువారం పలు చోట్ల ఈదురుగాలులతో కూడి న అకాల వర్షం కురవడంతో ధాన్యం తడిసింది. మోత్కూరు, ఆత్మకూరు (ఎం)తోపాటు పలు మండలాల్లో ధాన్యం కొట్టకుపోయింది కల్లాల వద్ద కూడా వడ్లు తడిసి ముద్దయ్యాయి. వర్షాలు ఇంకా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలోనూ ప్రభుత్వం కొనుగోళ్లు చేయకపోడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### కొనుగోళ్ల తీరు ఇలా..

- మోటకొండూరు మండలంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించగా, ఇప్పటి వరకు నాలుగు మాత్రమే ప్రారంభించారు. ఇందులోనూ కొనుగోలు మొదలు కాలేదు.
- ఆత్మకూరు (ఎం)లో 14 సెంటర్లను ప్రతిపాదించారు. 10 కేంద్రాలు ప్రారంభించినా.. ఇప్పటి వరకు ధాన్యం గింజ కొన్నది లేదు.
- గుండాల మండలంలో 16 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఒక్క దాంట్లోనూ వడ్లు కొన లేదు.
- బొమ్మల రామారం మండలంలో 11 కేంద్రాలు ప్రతిపాదించగ, ఒక్కటీ తెరువలేదు.
- అడ్డగూడూరు మండలంలో 5 ఐకేపీ సెంటర్లు, 7 పీఏసీఎస్ కేంద్రాలు ప్రారంభించగా, ఇంకా కొనుగోళ్లు ప్రారంభించ లేదు.
- రామన్నపేట మండలంలో 27 కేంద్రాలను ప్రతిపాదించగా, 25 చోట్ల సెంటర్లు తెరిచారు. కొనుగోళ్లు మాత్రం మరిచారు.
- ఆలేరు మండలంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం మాత్రం కొనడం లేదు.
- తుర్కపల్లి మండలంలో 14 సెంటర్లు ఉండగా, ఒక్కటీ తెరువలేదు.


కొనుగోళ్లు లేక మోటకొండూరులో నిలిచిపోయిన ధాన్యం రాశులు..

## సూర్యాపేట జిల్లాలో కొనుగోళ్లు జీరో..

సూర్యాపేట జిల్లాలో దాదాపు 80శాతం వరి కోతలు పూర్తి కాగా, ప్రభుత్వం గింజ ధాన్యం కూడా కొన్నది లేదు. ఈ సీజన్‌లో 4.07 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్న అధికార యంత్రాంగం గురువారం రాత్రి వరకు జిల్లావ్యాప్తంగా 264 కొనుగోలు కేంద్రాలను తెరిచింది. కానీ, ఇప్పటివరకూ ఎక్కడా కొనుగోళ్లు ప్రారంభించ లేదు. గోదావరి జలాలు రాకపోవడంతో జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో వరి పంట ఎండిపోగా, మిగిలిన పంటను సైతం మద్దతు ధరకు అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. కలెక్టర్ మొదలు అధికార యంత్రాంగం ప్రారంభించని కేంద్రాల చుట్టూ పర్యటిస్తూ హడావిడికి పరిమితమవడంపై రైతులు మండిపడుతున్నారు. ప్రతి యాసంగి సీజన్‌లో మార్చి 15 నుంచి 20 మధ్య కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుండగా, ఈసారి మూడు వారాలు ఆలస్యం చేశారు. ఈ నెల 7 నుంచి 11 వరకు సెంటర్లు తెరిచినా ఇప్పటికీ కొనుగోళ్లు మాత్రం చేయడం లేదు.

### దళారులు, మిల్లర్లు ఒక్కటై..

మరోవైపు సాగర్ ఆయకట్టులో సన్నధాన్యం కొనుగోళ్లపైనా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దాంతో కోత మిషన్ల ద్వారా కోసిన వడ్లను అమ్ముకునేందుకు రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఈ క్రమంలో మిల్లర్లు, దళారులు ఒక్కటై రైతులకు తక్కువ ధర చెల్లిస్తున్నారు. కొందరు మిల్లర్లు మా మిల్లు ధాన్యంతో నిండిపోయింది.. మాకు అవసరం లేదంటూ లోడ్లను తిప్పి పంపిస్తున్నారు. ఆఖరికి రూ.2,200లోపు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు 50 బస్తాల ధాన్యంతో వెళ్తిన బోరం లోడుకు 30 నుంచి 40 కేజీల వరకు తరుగు తీస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇదే యాసంగి పంటను ఇవే రకం సన్నాలను రూ.2,800 నుంచి 3వేల వరకు అమ్ముకున్న రైతులు ఇప్పుడు మద్దతు ధర కూడా దక్కక నష్టపోతున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.


నేరేడుచర్లలో వరి పొలం కోయిస్తున్న రైతులు

## నల్లగొండ జిల్లాలో సన్నాలు పట్టని సర్కారు


మిర్యాలగూడ మిల్లుల వద్ద వేచి ఉన్న ధాన్యం ట్రాక్టర్లు

సన్న ధాన్యానికి క్వింటాకు మద్దతు ధర రూ.2,320తోపాటు అదనంగా రూ.500 బోనస్ ఇప్పిస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వం ఈ యాసంగి సీజన్‌లో ఇంతవరకు ఒక గింజ కూడా కొనుగోలు చేయలేదు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు కింద రైతులు సన్నాలే పండిస్తుండగా, నల్లగొండ జిల్లాలో సన్న ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం 23 కేంద్రాలు ప్రతిపాదించింది. వాటిల్లో 18 ప్రారంభించగా ఎక్కడా కొనుగోళ్లను ప్రారంభించలేదు. దాంతో రైతులు మిర్యాలగూడ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న మిల్లులకు ధాన్యం లోడ్లు తీసుకువస్తున్నారు. ఇదే అదునుగా మిల్లర్లు సిండికేట్ అయ్యి రూ.2వేల నుంచి రూ.2,200లోపే ధర పెడుతున్నారు.

### ప్రభుత్వం పట్టించుకోక రైతులు నష్టాల పాలు



నేను 16 ఎకరాలు కౌలుకు తీసుకుని సన్న వడ్లు పండించాను. తీరా అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించ లేదు. మిల్లుల దగ్గరికి తీసుకు వస్తే పచ్చ గింజ ఉందంటూ కొర్రీలు పెట్టి 2,100 రూపాయలకు కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే నాలా చాలామంది రైతులు నష్టపోయేవాళ్లు కాదు.

**-రామకృష్ణ, రైతు, గోదావరిగూడెం, వేములపల్లి మండలం**

## జీపీఎఫ్ బిల్లులు చెల్లించాలని టీచర్ల నిరసన


సూర్యాపేట జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 11 : జడ్పీ జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బిల్లులు, ఫైనల్ లోన్స్, ఫైనల్ పేమెంట్స్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు శుక్రవారం సూర్యాపేట జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాములు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. మార్చి 2025 నుంచి సుమారు 21 చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులకు ప్రభుత్వం రూ.18.72 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలు వెంటనే బిల్లులు చెల్లించేవని, కానీ ప్రస్తుత ప్రభుత్వం జాప్యం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సోమయ్య, అనిల్ కుమార్, అరుణ, భారతి, శ్రీనివాస్ రెడ్డి, దామోదర్, నాగేశ్వర్‌రావు, సాంబయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నార్ముల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి

## డబ్బులకు అమ్ముడుపోయిన నార్ముల్ డైరెక్టర్లు!

- ఒక్కో డైరెక్టర్‌కు రూ.5 లక్షలు ముట్టినట్లు ప్రచారం
- వెంటనే పెండింగ్ పాల బిల్లులు.. ఉద్యోగుల జీతాలు విడుదల చేయకపోతే ఆందోళనలు చేస్తాం
- మీడియా సమావేశంలో నార్ముల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఏప్రిల్11: అవినీతి, అసమర్థత కారణంగా నార్ముల్ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించుకున్న డైరెక్టర్లు, అదే చైర్మన్‌కు డబ్బులకు అమ్ముడుపోయి అవిశ్వాసాన్ని విరమించుకున్నారని నార్ముల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి ఆరోపించారు. ఒక్కో డైరెక్టర్‌కు రూ. 5 లక్షలు చైర్మన్ ఇచ్చినట్లు ప్రచారం సాగుతుందని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాడి రైతులకు 6 బిల్లులు పెండింగ్‌లో పెట్టి, చైర్మన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్‌కు చెందిన 13 మంది డైరెక్టర్లు యాదగిరిగుట్ట రెడ్డి సత్రంలో రహస్యంగా సమావేశం ఏర్పాటు చేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. చైర్మన్‌ను వెంటనే గద్దె దింపాలని, ఆయన తీరుతో సంస్థ తీవ్ర నష్టాల్లో కూరుకుపోతుందని స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఫిర్యాదు చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేతో సమావేశం అనంతరం డైరెక్టర్లు ఎందుకు మాట మార్చారో సమాధానం చెప్పాలని అన్నారు. సంస్థ ఎన్నికల సమయంలో నార్ముల్‌కు ఉన్న పెండింగ్ బిల్లులు అందజేయడంతోపాటు ప్రభుత్వం తరపున రూ. 30 కోట్ల గ్రాంట్లు మంజూరు చేయిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చెప్పారని, కానీ ఇంతవరకూ అతీగతి లేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా నార్ముల్ సంస్థకు ఒక్క రూపాయి మంజూరు చేయలేదన్నారు. రోజుకు 40 వేల లీటర్ల పాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించి రోజువారీగా డబ్బులు చెల్లిస్తున్న చైర్మన్‌కు పాల సంఘాల ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. అవినీతిగా పేరొందిన గుడిపాటిని కొనసాగిస్తారా? లేక వేరే వ్యక్తిని నియమిస్తారో ప్రభుత్వ ఇష్టమని, కానీ పాడి రైతులకు పెండింగ్‌లోఉన్న 6 బిల్లులు, ఉద్యోగులకు జీతాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. వారంరోజుల్లో సానుకూల స్పందన రాకపోతే సంస్థకు పాలను విక్రయించబోమని 400 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల నుంచి నోటీసులు ఇచ్చి, నార్ముల్ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నార్ముల్ డైరెక్టర్ కందాల అలివేలరంగారెడ్డి, మాజీ డైరెక్టర్లు దొంతిరి సోమిరెడ్డి, ఒగ్గు భిక్షపతి, పాల సంఘం చైర్మన్లు మైదం రంగన్న, సతీశ్‌రెడ్డి, రాములు, సురేశ్ పాల్గొన్నారు.

# అకాల వర్షంతో పంటలకు నష్టం

- నేలరాలిన మామిడి.. విరిగిన బొప్పాయి చెట్లు
- దెబ్బ తిన్న కూరగాయలు, ఉద్యాన తోటలు


పెద్దఅడిశర్లపల్లి : ఘనిపల్లి గ్రామంలో నేలవాలిన మొక్కజొన్న

గుర్రంపోడు, ఏప్రిల్ 11 : అకాల వర్షం అన్నదాతకు నష్టం మిగిల్చింది. గురువారం సాయంత్రం కురిసిన గాలివానకు నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరితోపాటు మామిడి, మొక్కజొన్న, ఉద్యానం పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గుర్రంపోడు మండలంలో కోతకు వచ్చిన వరి పొలాలు నేలకు వాలాయి. బొప్పాయి చెట్లు విరిగిపోయాయి. కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. పంట నష్టాన్ని అంచనా వేయడానికి శుక్రవారం వ్యవసాయ, ఉద్యానవన అధికారులు మండలంలోని కొప్పోలు, పిట్టలగూడెం, బ్రహ్మణగూడెం, కోనాయిగూడెం, జిన్నాయిచింత తదితర గ్రామాల్లో పర్యటించారు. పిట్టలగూడెంలో కూరగాయ పంటలతోపాటు బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు హెచ్ఓ మురళి తెలిపారు. రెండు ఎకరాల్లో సోర పందిరి వడగండ్లకు దెబ్బతిన్నదని, రూ.రెండు లక్షల పంట నష్టం జరిగిందని రైతు కేసాని అనంత రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. జిన్నాయిచింతలో మారపాక మార య్య రైతుకు చెందిన 1500 బొప్పాయి చెట్లు నేలకూలాయి. రూ.10 లక్షల నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు. పిట్టలగూడెంలో పొగాకు నారాయణ రైతుకు చెందిన ఆరు ఎకరాల్లో చేతికొచ్చిన బొప్పాయి పంట నేలపాలైంది. రూ.12 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపాడు. మండలంలో 20 ఎకరాల్లో ప్రధానంగా ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్లు నివేదికను అందించామని మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి తెలిపారు.

పెద్దవూర : మండలంలో అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. పోతునూరు తదితర గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది.


పెద్దవూర : నేల రాలిన మామిడి కాయల వద్ద రైతు తమ్మ శ్రీను

పెద్దఅడిశర్లపల్లి : అకాల వర్షానికి గుడిపల్లి మండలంలోని ఘనిపల్లి గ్రామంలో గాదె ప్రతాప్‌రెడ్డి, గాదె విద్యాసాగర్‌రెడ్డికి చెందిన దాదాపు 10 ఎకరాల మొక్క జొన్న పంట నేల వాలింది. మొక్క జొన్న కంకి పడుతున్న సమయంతో గాలి వానకు దెబ్బతిన్నదని, భారీగా నష్టం జరిగిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### మామిడి కాయలు రాలి నాలుగు లక్షల నష్టం వచ్చింది

నాకు గ్రామంలో రెండు ఎకరాల్లో మామిడి తోట ఉంది. గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఐదారు టన్నుల మామిడికాయలు నేలరాలాయి. సుమారు 4లక్షల మేర నష్టం వచ్చింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి.

**- తమ్మ శ్రీను, రైతు, పోతునూరు, పెద్దవూర**


గుర్రంపోడు : పిట్టలగూడెంలో విరిగిన బొప్పాయి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి మురళి